బాబూ జగ్జీవన్‌రామ్ బాటలో నడవాలి



డా. బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

భారత మాజీ ఉప ప్రధాని డా. బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు బుధవారం కూకట్‌పల్లి జంట సర్కిళ్ల పరిధిలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలు, చిత్రపటాలకు ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, పలు సంఘాల ప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ... జగ్జీవన్‌రామ్ స్వాతంత్ర్య సమర యోధుడని.. అంతే కాకుండా ఆయన గొప్ప సంఘ సంస్కర్త అని కొనియాడారు. ప్రతి ఒక్కరూ ఆయన బాటలో నడవాలని కోరారు. – కూకట్‌పల్లి



రిక్షా పుల్లర్స్ కాలనీలో నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ మాధవరం రోజాదేవి రంగారావు



హైదర్‌నగర్ మెయిన్ రోడ్డులో నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు తదితరులు



జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్



ఓల్డ్‌బోయిన్‌పల్లి లాస్ట్ బస్‌స్టాప్‌లో నివాళులు అర్పిస్తున్న కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్



డా. బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న టీపీసీసీ కార్యదర్శి సత్యం శ్రీరంగం



డా. బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న మాజీ కార్పొరేటర్ వెంగళరావు



బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న జిల్లా ఓబీసీ సెక్రటరీ శ్రీనివాస్‌యాదవ్

క్లుప్తంగా

పిల్లల భవిష్యత్‌తో ఆటలాడొద్దు

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



కూకట్‌పల్లి: బీజేపీ కార్యకర్త బూర ప్రశాంత్ ఫొటోలు తీసి అవి రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్‌కి వాట్సాప్‌లో పెట్టడం ఎంత వరకు సమంజసమని... తమ రాజకీయ లబ్ధి కోసం పిల్లల భవిష్యత్‌తో ఆటలాడొద్దని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పేర్కొన్నారు. బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేయాలన్న ఉద్దేశం ప్రత్యక్షంగా బయటపడిందన్నారు. ఇలాంటి చర్యలకు పాల్పడితే తెలంగాణ ప్రజలు ఉపేక్షించరని బండి సంజయ్‌కి తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. నేటి బాలలే రేపటి పౌరులు, దేశానికి వెన్నుముక అన్న నానుడి కూడా మరిచిపోయి చివరకు వీరి రాజకీయ లబ్ధి కోసం పిల్లలను పావులుగా వాడుకోవటం నిజంగా క్షమించలేని నేరమన్నారు.

ఇన్‌స్పెక్టర్ నర్సింగ్‌రావుకు జన్మదిన శుభాకాంక్షలు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నర్సింగ్‌రావు పుట్టినరోజు సందర్భంగా బుధవారం వివేకానందనగర్ రామకృష్ణవీధి అసోసియేషన్ అధ్యక్షుడు జనంపల్లి పురేందర్ రెడ్డి ఆయనను శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పురేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఇన్‌స్పెక్టర్ నర్సింగ్‌రావు శాంతిభద్రతల విషయంలో ఎంతో కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో సూర్యనారాయణ, శ్రీధర్, మూర్తి, మాధవ్ పాల్గొన్నారు.

విరాళం



ఆలయ ధర్మకర్తకు చెక్కు అందజేస్తున్న నాగేశ్వరరావు

మోతీనగర్: మోతీనగర్‌కు చెందిన బిజ్జ మల నాగేశ్వర రావు ఆలయ పునర్ నిర్మాణానికి విరాళం అందజేశారు. ఈ మేరకు బుధవారం ఆలయ ధర్మకర్త రమేష్ అయ్యంగార్‌కు రూ.10వేల చెక్కును అందించారు. ఈ సందర్భంగా రమేష్ అయ్యంగార్ మాట్లాడుతూ.. ఇప్పటికే దాదాపు ఆలయ పునర్నిర్మాణ పనులు పూర్తయ్యాయని అన్నారు. మిగిలిన పనులను కూడా త్వరగా పూర్తి చేసి భక్తులకు అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. ఎవరైనా విరాళాలు అందజేసే వారు ఆలయంలో అందజేయాలని కోరారు.

బలగం చిత్ర యూనిట్‌కు ఎమ్మెల్యే అభినందనలు



బలగంలో విలన్‌గా నటించిన సంజీవ్‌గౌడ్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

ఆల్విన్‌కాలనీ: బలగం సినిమాలో విలన్ పాత్రధారి సంజీవ్‌గౌడ్‌ను ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ ఆయన నివాసంలో బుధవారం సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... సంజీవ్‌గౌడ్ శేరిలింగంపల్లి నివాసి కావటం గర్వకారణమన్నారు. మన ప్రాంత ప్రతిష్టను మరింత పెంచారన్నారు. చాలా కాలం తర్వాత ఒక మంచి సినిమా తెలంగాణ యాస, భాష, మంచి కథనంతో నడిపించిన తీరు చాలా బాగుందన్నారు. ఎలాంటి గ్రాఫిక్స్, హంగు, ఆర్భాటాలు లేకుండా అచ్చమైన తెలంగాణ భాష, యాసతో బలంగం, బంధుత్వం అనే సెంటిమెంట్లను ఉన్నది ఉన్నట్లుగా చూపించడంలో డైరెక్టర్ వేణు సక్సెస్ అయ్యారన్నారు.

పేపర్ లీక్‌తో ప్రభుత్వంపై నమ్మకం పోయింది

- బండి సంజయ్ అరెస్ట్‌కు నిరసనగా ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం
- నియోజకవర్గం వ్యాప్తంగా బీజేపీ నిరసనలు

ఓల్డ్‌బోయిన్‌పల్లి: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్‌ను పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ పార్టీ నాయకులు ఆందోళనకు దిగారు. బుధవారం హస్మత్‌పేట చౌరాస్తాలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద మంత్రి కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. డివిజన్ బీజేపీ అధ్యక్షుడు సంతోష్‌కుమార్‌గౌడ్ నిర్వహించిన నిరసన కార్యక్రమంలో జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు ఎనుగుల తిరుపతి, రాష్ట్ర బీజేవైఎం కార్యవర్గ సభ్యుడు కన్నె ప్రకాశ్, జిల్లా కార్యాలయ ఇన్‌చార్జ్ రవికుమార్ పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పేపర్ లీక్‌తో ప్రభుత్వంపై ప్రజలకు నమ్మకం పోయిందని.. దానిని కప్పిపుచ్చుకునేందుకే బండి సంజయ్‌ను అక్రమంగా అరెస్టు చేశారన్నారు. ఇదంతా ప్రజలు గమనిస్తున్నారని త్వరలో బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెబుతున్నారని అన్నారు.

సీఎం దిష్టిబొమ్మ దహనం

కూకట్‌పల్లి: బండి సంజయ్‌ని అక్రమ అరెస్టుకు నిరసనగా కూకట్‌పల్లి జంట సర్కిళ్ల పరిధిలో బుధవారం ముఖ్యమంత్రి కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కూకట్‌పల్లిలోని బీజేపీ కార్యాలయం వద్ద డివిజన్ అధ్యక్షుడు అనంత నాగరాజు ఆధ్వర్యంలో కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు పన్నాల హరీష్ రెడ్డి, సీనియర్ నాయకుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు పాల్గొని మాట్లాడారు. కేసీఆర్ ప్రభుత్వం బండి సంజయ్‌ని అరెస్టు చేయటంపై నిరసన తెలిపారు. బీఆర్‌ఎస్ అరాచకాలను ప్రజలు గమనిస్తూనే ఉన్నారన్నారు.

ఎల్లమ్మబండలో...

బండి సంజయ్ అక్రమ అరెస్టును ఖండిస్తూ ఎల్లమ్మబండ చౌరస్తాలో బీజేపీ నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రవికుమార్‌యాదవ్ మాట్లాడుతూ... బండి సంజయ్ అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. బండి సంజయ్‌ను చూస్తేనే భయపడుతున్న బీఆర్‌యస్ ప్రభుత్వం ఒక నియంతలా వ్యవహరిస్తోందన్నారు. టీఎస్‌పీఎస్సీ ప్రశ్నాపత్రాల లీక్ వ్యవహారన్ని సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.



ఎల్లమ్మబండ చౌరస్తాలు నిరసన తెలుపుతున్న రవికుమార్‌యాదవ్ తదితరులు

బండి సంజయ్ పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేయాలి

ఉస్మానియా యూనివర్సిటీ: పదవ తరగతి ప్రశ్నపత్రాల లీకేజీ ఘటనలో అరెస్టు అయిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ పార్లమెంట్ సభ్యత్వం రద్దు చేయాలని బీఆర్‌ఎస్ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చటారి దశరథ్ డిమాండ్ చేశారు. బుధవారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న ఎంపీ బండి సంజయ్ సభ్యత్వాన్ని రద్దు చేయకుంటే తెలంగాణలో ప్రధాని నరేంద్ర మోదీ పర్యటనను అడ్డుకుంటామని హెచ్చరించారు.

స్పౌజ్ టీచర్లకు బదిలీలు చేపట్టాలి

రాష్ట్ర శాఖ అధ్యక్షుడు పోకల శేఖర్



నాన్‌స్పౌజ్ టీచర్స్ అసోసియేషన్‌లో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు పోకల శేఖర్

కూకట్‌పల్లి: మేడ్చల్ జిల్లా తెలంగాణ నాన్ స్పౌజ్ టీచర్స్ అసోసియేషన్ సాధారణ సర్వసభ్య సమావేశం కూకట్‌పల్లిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం నిర్వహించారు. ఈ సమావేశంలో బదిలీలలో స్పౌజ్ టీచర్‌లకు ప్రత్యేకంగా ఇచ్చే 10 పాయింట్లను రద్దు చేసి బదిలీలను వెంటనే చేపట్టాలని రాష్ట్ర శాఖ అధ్యక్షుడు పోకల శేఖర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సక్కుబాయి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

◆ ఈ సమావేశంలో మేడ్చల్ జిల్లా అడ్‌హాక్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మేడ్చల్-మల్కాజ్‌గిరి తెలంగాణ నాన్ స్పౌజ్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వార్ల వెంకటయ్య, ప్రధాన కార్యదర్శి కె. దత్తాత్రేయ, అసోసియేషన్ ఉపాధ్యక్షులు కుక్కడపు జగదీష్ కుమార్, ఒగ్గు శ్రీనివాస్, ఆదినారాయణ, కోశాధికారి కురుమ లక్ష్మయ్య, మహిళా ఉపాధ్యక్షురాలు కొయ్యగూర ప్రసన్నభారతి, సంయుక్త కార్యదర్శి జి. కృష్ణ, మహిళా కార్యదర్శి రంజని, జిల్లా కార్యదర్శి అశోక్ కుమార్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

◆ ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు వార్ల వెంకటయ్య మాట్లాడుతూ.. బదిలీలు స్పౌజ్ టీచర్లకు ప్రత్యేకమైన పాయింట్లు ఇవ్వడం వల్ల అధిక హెచ్ఆర్ఏ ప్రాంతాలను కోరుకుని విధులు కొనసాగిస్తున్నామని అన్నారు. ప్రభుత్వం స్పౌజ్, నాన్ స్పౌజ్ టీచర్లని వేర్వేరుగా చూడకుండా బదిలీలలో ఒకే రకమైన పద్ధతిని పాటించాలని కోరారు. సమావేశంలో రంగారెడ్డి జిల్లా టీఎన్ఎస్‌టీఏ అధ్యక్షుడు సిద్ధం శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

వీధుల్లో కాషాయ రెపరెపలు

నేడు బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో వీర హనుమాన్ శోభాయాత్ర



హస్మత్‌పేట చౌరాస్తాలో కాషాయ తోరణాలు

ఓల్డ్ బోయిన్‌పల్లి: హనుమాన్ జయంతిని పురస్కరించుకొని బుధవారం ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ వీధులను కాషాయ తోరణాలతో అలంకరించారు. గురువారం బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో వీర హనుమాన్ శోభాయాత్ర నిర్వహిస్తున్నారు. ఈ శోభాయాత్రలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని బోయిన్‌పల్లి వాయుపుత్ర జిల్లా కార్యదర్శి యోగానంద రాజు కోరారు.

హస్మత్‌పేట నుంచి గౌలిగూడకు..

◆ ముందుగా ఓల్డ్‌బోయిన్‌పల్లి, హస్మత్‌పేట, అంజయ్యనగర్, ముస్లిం బస్తీ, ఎల్‌బీనగర్, దుబాయి గేట్, హెచ్ఏఎల్ కాలనీ, టీచర్స్‌కాలనీ, గంగపుత్రం సంఘంతో పాటు బోయిన్‌పల్లి నందమూరినగర్ నుంచి గౌలిగూడ వరకు శోభయాత్ర చేరుకుని అక్కడి నుంచి తాడ్‌బన్ హనుమాన్ దేవాలయం వరకు బైక్ ర్యాలీ ఉంటుందన్నారు.

అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ కాలనీలోని శ్రీ అయ్యప్పస్వామి దేవాలయంలో ఉత్తర నక్షత్రం పురస్కరించుకొని బుధవారం శ్రీ హరిహరసుత అయ్యప్ప స్వామివారి పుట్టిన రోజు వేడుకగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త వడ్డేపల్లి రాజేశ్వరరావు దంపతులు 108 గంగా జలాలతో కలశపూజ చేశారు. స్వామివారికి పంచామృతాభిషేకాలు, భజనలు, కీర్తనలు, మహా పడిపూజ, పుష్పాభిషేకం ఘనంగా నిర్వహించారు. అనంతరం స్వామివారిని పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులయ్యారు.

విద్యార్థుల భవిష్యత్‌తో చెలగాటం ఆడొద్దు

అడ్డగుట్ట: రాష్ట్రంలో పదవ తరగతి పరీక్షల ప్రశ్నపత్రాల వరుస లీకుల ఘటనలతో విద్యార్థుల జీవితాలు ఆగమవుతున్నాయని తెలంగాణ తల్లుల సంఘం రాష్ట్ర కన్వీనర్ భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. బుధవారం బాలల హక్కుల పరిరక్షణ వేదిక, తెలంగాణ తల్లుల సంఘం ఆధ్వర్యంలో అడ్డగుట్టలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్రంలో ఎంతోమంది తల్లిదండ్రులు ఆర్థిక పరమైన ఇబ్బందులను ఎదుర్కొని కూడా తమ పిల్లలను చదివిస్తుంటే, పరీక్షలు సక్రమంగా నిర్వహించలేని పరిస్థితిలో నేటి విద్యాశాఖ ఉందని విమర్శించారు.

కేపీహెచ్‌బీ డివిజన్‌లో మెరుగైన సౌకర్యాలు కల్పించాం



సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ శ్రీనివాసరావు

కేపీహెచ్‌బీకాలనీ: కేపీహెచ్‌బీ డివిజన్‌లో 3 కోట్ల 98 లక్షల రూపాయలతో వివిధ ప్రాంతాల్లో సీసీ రోడ్ల పునరుద్ధరణ పనులకు బుధవారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు శంకుస్థాపన చేశారు. అనంతరం వసంత్‌నగర్‌లోని 1 కోటి 78 లక్షల రూపాయలతో నిర్మించిన నీటి రిజర్వాయర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... నిత్యం నియోజకవర్గంలో ఏదో ఒక చోట అభివృద్ధి కార్యక్రమాలు చేసుకుంటూనే ఉన్నామన్నారు. నియోజకవర్గంలో దాదాపు 90శాతం పనులు పూర్తి చేసుకున్నామని అన్నారు. కేపీహెచ్‌బీ డివిజన్ సమస్యలు లేని డివిజన్‌గా మారిందన్నారు. అక్కడక్కడా చిన్నచిన్న సమస్యలు ఉంటే వాటిని త్వరగా పరిష్కరిస్తామని తెలిపారు. రోడ్లు, పార్కులు, చిన్నపిల్లలకు, మహిళలకు పార్కులు, ఫ్లై ఓవర్లు, అండర్ పాస్ బ్రిడ్జిలు, హిందూ, ముస్లిం శ్మశానవాటికలు, విద్యుత్, మంచినీరు వంటి అన్ని మౌలిక సదుపాయాలకు ఎక్కడా లోటు లేకుండా కేపీహెచ్‌బీ డివిజన్‌లో ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించామన్నారు. అందుకు సహకరించిన ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్‌లకు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు.

◆ క్రీడలకు సంబంధించి ఓపెన్‌జిమ్‌లు, ఇండోర్‌షటిల్ కోర్టులు, క్రీడా మైదానాలను ప్రజలు ఉపయోగించుకోవాలని తెలిపారు. అన్ని ప్రాంతాల వారు అన్నదమ్ముల్లా కలిసిమెలిసి ఉంటూ కూకట్‌పల్లి నియోజకవర్గంలో మత సామరస్యాన్ని పెంచుతున్నారని అన్నారు. ప్రతిపక్షాలు ఎన్నికుట్రలు చేసినా విజ్ఞత కలిగిన ప్రజలు ఉండబట్టే శాంతిభద్రతలు అదుపులో ఉన్నాయన్నారు. పిల్లల భవిష్యత్‌తో ఆడుకుంటున్న రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయ లబ్ధి కోసం పిల్లల భవిష్యత్‌ను అడ్డం పెట్టుకుంటున్న వారికి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. అందుకు ప్రజలే నిర్ణయం తీసుకుంటారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు, ఈఈ సత్యనారాయణ, డీఈ ఆనంద్, ఏఈ సాయిప్రసాద్, నాయకులు పాల్గొన్నారు.

శానిటేషన్, రాంకీ సిబ్బంది సమన్వయంతో పని చేయాలి



జీహెచ్ఎంసీ, రాంకీ సిబ్బందితో మాట్లాడుతున్న కార్పొరేటర్ సబిహా బేగం

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ వివేకానందనగర్ కమిటీహాల్‌లో కార్పొరేటర్ సబిహా బేగం, శానిటేషన్ సిబ్బంది, రాంకీ సిబ్బందితో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... శానిటేషన్ విషయంలో ఇద్దరు సమన్వయంతో పని చేయాలన్నారు. ఖాళీ ప్రదేశాల్లో చెత్తాచెదారాన్ని ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని సూచించారు. ఆటో రిక్షా వారు ప్రతి వీధిలో చెత్తాచెదారాన్ని సేకరిస్తున్నారో లేదో గమనించాలన్నారు. ప్రతి అపార్టుమెంట్‌లోని వారు చెత్తను అందజేస్తున్నారో లేదో తెలుసుకొని వారికి అవగాహన కల్పించాలని సూచించారు. పొడి, తడి చెత్తను వేరు చేసి అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు గౌసుద్దీన్, సురేష్, నరసింహ, అల్లాపూర్ ఇన్‌చార్జి ఎస్ఆర్‌పీ సురేష్, అరుణ్‌కుమార్, నరేందర్, శాంతి, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి




వైద్య శిబిరంలో మందులను అందజేస్తున్న వడ్డేపల్లి రాజేశ్వరరావు

కూకట్‌పల్లి: పేదల సౌకర్యార్థం ఏర్పాటు చేస్తున్న ఉచిత వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని టీటీడీ బోర్డు అడ్వైజరి కమిటీ సభ్యులు, బీజేపీ సీనియర్ నాయకుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు కోరారు. బుధవారం కూకట్‌పల్లి నియోజకవర్గంలోని ఏవీబీ పురంలో కేబీకే హాస్పిటల్ వారి సౌజన్యంతో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని వడ్డేపల్లి రాజేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు సూర్యప్రకాశరావు, సూర్యారావు, శ్రీనివాస్‌గౌడ్, శంకర్‌రెడ్డి, సంతోష్, విశాల్, భాస్కర్, కృష్ణప్రియ, కల్పన, సాయి కుమార్, ఈశ్వర్, అరవింద్ నాయుడు, సాయి, నరేందర్‌రెడ్డి, వినయ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్తలు పాటించండి.. ఆరోగ్యంగా ఉండండి

- బాలానగర్ ప్రభుత్వ ఆస్పత్రికి పెరిగిన రోగుల తాకిడి
- కొన్ని రోజులుగా పెరిగిన కరోనా టెస్టులు
- వారం క్రితం ఇద్దరికి కరోనా పాజిటివ్



బాలానగర్: కోవిడ్ కేసులు పెరుగుతున్నాయనే వార్తలు వస్తున్న నేపథ్యంలో ప్రజల్లో చైతన్యం పెరిగింది. కొన్ని రోజులుగా బాలానగర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి వస్తున్న వారిలో ఎక్కువ మంది కరోనా టెస్టుల కోసమే వస్తున్నారని వైద్యులు తెలుపుతున్నారు. వారం క్రితం ఇద్దరికి కరోనా పాజిటివ్ వచ్చిందని అధికారులు వారికి మందుల కిట్ ఇచ్చి ఐసోలేషన్‌లో ఉండమని సూచించారు.

ఎందుకు పెరుగుతున్నాయంటే..

ప్రజలు మాస్కు ధరించటం, శానిటైజర్ వాడటం మానేశారు. సామాజిక దూరం ప్రజలు పూర్తిగా విస్మరించడంతోనే కోవిడ్ కేసులు మళ్లీ పెరుగుతున్నాయని వైద్యులు తెలుపుతున్నారు. మళ్లీ జాగ్రత్తలు పాటించాలని సూచిస్తున్నారు. జలుబును నిర్లక్ష్యం చేయవద్దని తెలుపుతున్నారు. స్వీయ నియంత్రణను పాటించాలని కోరుతున్నారు. జలుబు, దగ్గు ఉంటే నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలని కోరారు. బాలానగర్, ఫతేనగర్ డివిజన్లలో పనిచేసే కార్మికులు ఎక్కువగా నివసిస్తూ ఉంటారు. ఇతర రాష్ట్రాలకు చెందిన కార్మికులు ఎక్కువగానే ఉంటారు.

ఆస్పత్రికి తాకిన రోగుల తాకిడి..

నిత్యం జలుబు, దగ్గు, జ్వరాలతో ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే రోగుల సంఖ్య పెరిగిందని వైద్యులు చెబుతున్నారు. కోవిడ్ టెస్టు చేయమని అడిగి మరీ పరీక్షలు చేయించుకుంటున్నారు. మరికొందరు కోవిడ్ వ్యాక్సిన్ కోసం వస్తున్నారు. రెండో డోస్ కోసం కొందరు, బూస్టర్ డోస్ కోసం మరి కొందరు ఆస్పత్రికి వస్తున్నారు.

దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు జాగ్రత్తలు తీసుకోవాలి



తాజా వేరియంట్ కారణంగా ప్రాణాపాయానికి ఆస్కారం లేదు. వైరస్ నిత్యం రూపాంతరం చెందే గుణం ఉండటం వల్లే కోవిడ్ వైరస్ అక్కడక్కడ బయటపడుతోంది. బ్యాక్టీరియా వైరస్‌లకు ఉండే సాధారణ లక్షణమే అది. ప్రాణాంతకం కాదు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, శ్వాసకోశ సంబంధిత వ్యాధులతో బాధపడేవారు, రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్నవారు తగు జాగ్రత్తలు తీసుకోవాలి.

– డా. చందర్, బాలానగర్ ప్రభుత్వ ఆస్పత్రి వైద్యుడు

ఐడియల్ చెరువు కట్టపై దుమ్ము, ధూళి



ఐడియల్ చెరువు కట్టపై పేరుకుపోయిన దుమ్ము, ధూళి



మూసాపేట: కూకట్‌పల్లి ఐడియల్ చెరువు కట్టపై వందలాది మంది నిత్యం వాకింగ్, జాగింగ్ చేస్తుంటారు. రోడ్డుపై మట్టి పేరుకుపోయి వాహనాలు రాకపోకల సమయంలో దుమ్ము, ధూళి పైకి లేవటంతో వాకర్స్ ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాకుండా ఫుట్‌పాత్‌పై మట్టి, దుమ్ము పేరుకుపోయింది. కనీసం వాకింగ్ కూడా చేసుకోలేకపోతున్నామని వారు వాపోతున్నారు. మట్టి పేరుకుపోవడంతో పాటు కొద్దిగా మలుపు ఉండటంతో వేగంగా వచ్చే వాహనాలు ప్రమాదాల బాభారిన పడే అవకాశం ఉంది.

దవాఖానాల దగ్గర దుర్గంధం

బాలానగర్: బాలానగర్‌లోని ఈఎస్ఐ డిస్పెన్సరీ వద్ద చెత్తాచెదారం పేరుకుపోయి దుర్వాసన వస్తోంది. నాలుగైదు రోజులుగా చెత్తను జీహెచ్ఎంసీ కార్మికులు తీయటం లేదని స్థానిక కాలనీవాసులు తెలుపుతున్నారు. ఈఎస్ఐ ఆస్పత్రికి వచ్చి వెళ్లే వారికి ఇబ్బందిగా ఉందంటున్నారు. వెంటనే చెత్తను తరలించాలని కోరుతున్నారు.